సాక్షి నిజామాబాద్

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



అందని వేతనాలు..

ఈ–పంచాయతీ ఆపరేటర్లకు ఐదు నెలలుగా వేతనాలు అందడంలేదు. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 10లో ▸



రైతు సంక్షేమానికే..

రైతు సంక్షేమానికే మార్కెటింగ్‌శాఖ, పాలకవర్గం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

36.5 /11.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

‘ఎమ్మెల్సీ’ పోలింగ్ కేంద్రాలు 81

- పట్టభద్రులకు 48, ఉపాధ్యాయులకు 33
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జిల్లాలో మొత్తం 31,574 ఓట్లు ఉండగా 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 3,751 ఓట్లు ఉండగా 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



నిజామాబాద్‌అర్బన్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భోగ్ బండార్‌లో పాల్గొని నైవేద్యం స్వీకరించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ–2008 అభ్యర్థులకు పోస్టింగ్



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు డీఎస్సీ–2008 అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చింది. జిల్లాలో 74 మందిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించారు. తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం రిపోర్ట్ చేయాలని డీఈవో ఆదేశించారు. 18 సంవత్సరాలుగా పోరాడిన డీఎస్సీ–2008 అభ్యర్థులు తమకు ఉద్యోగం కల్పించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐక్యతకు ఆకుపచ్చ కండువా

ప్రశాంతత, స్థిరత్వం, గంభీరత్వానికి ప్రతీకగా నిలిచే ఆకుపచ్చ రంగు అన్నదాతకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. తాము రైతులమని గర్వంగా చెప్పుకోవాలన్నా.. తమకు జరుగుతున్న అన్యాయంపై పోరాడాలన్నా.. అన్నదాతలు తమ మెడలో ఆకుపచ్చ రంగు కండువా వేసుకుని ముందుకు వస్తున్నారు. అంతేకాదు రైతులతో కలిసి నడవాలనుకునే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తమ పార్టీల కండువాలను పక్కన పెట్టి ఆకుపచ్చ కండువా వేసుకోవాల్సిందే. రైతు ఐక్యతను ఆకుపచ్చ కండువా చాటిచెబుతోంది.

ఆర్మూర్‌లో రాజకీయాలకు అతీతంగా ఆకుపచ్చ కండువాలు కప్పుకొని ఉద్యమంలో పాల్గొన్న రైతులు (ఫైల్)





నర్సారెడ్డి నడిపిన ఉద్యమం

పచ్చని పంటలను సాగు చేసే రైతులకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని బద్దం నర్సారెడ్డి ఆలోచన చేశారు. వ్యవసాయదారులు తమ భుజాలపై ఆకుపచ్చ కండువాలు వేసుకోవాలని అవగాహన కల్పిస్తూ 1978లో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ చర్య వ్యవసాయ రంగం చరిత్రలో రైతులందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది. పచ్చ కండువాల ఉద్యమం వేగంగా పుంజుకుని ఇతర జిల్లాలకూ విస్తరించింది. 2004 జూన్‌లో బద్దం నర్సారెడ్డి కన్నుమూయగా 2012లో మోర్తాడ్ మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఘన నివాళులర్పించారు.



రైతన్నను ఏకం చేసిన బద్దం నర్సారెడ్డి

- ప్రత్యేక గుర్తింపు కోసం కృషి
- 1978లో ఆకుపచ్చ కుండువాల ఉద్యమం ప్రారంభం
- 1979లో రైతు సంఘం ఆవిర్భావం
- రాజకీయాలకు అతీతంగా మారిన రైతు కండువా
- సీఎం, మినిస్టర్స్, పీఎం.. ఎవరైనా భుజాలపై వేసుకోవాల్సిందే..

ఆర్మూర్: రైతు చైతన్యం, ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్ ఆర్మూర్ డివిజన్. ఈ ప్రాంత రైతుల మెడలో కనిపించే ఆకు పచ్చ రంగు కండువా ప్రత్యేకతను సంతరించుకుంది. ఎవరికి వారు కాకుండా రైతులు ఐక్యంగా ఉండాలని, తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచనతో మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన బద్దం నర్సారెడ్డి ‘పచ్చ కండువా’ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ ఉద్యమం నిజామాబాద్‌తోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు విస్తరించింది. ప్రతి రైతూ మెడలో పచ్చ కండువా వేసుకోవాలని విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నర్సారెడ్డి 1979లో జిల్లా రైతు సంఘాన్ని ఏర్పాటు చేసి వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యారు. రైతు కుటుంబంలో పుట్టి న్యాయవాద విద్యను అభ్యసించిన నర్సారెడ్డి రైతుల ఐక్యత కోసం విశేష కృషి చేశారు. రైతు సంఘం ఆవిర్భావం తరువాత రైతుల్లో ఆదరణ పెరిగి ఆకు పచ్చ కండువాలు వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

సండే స్పెషల్



ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో రైతు నాయకుడు బద్దం నర్సారెడ్డి (ఫైల్)

ఉద్యమం ఏదైనా..

రాజకీయాలకు అతీతంగా జిల్లాలో చేపట్టిన రైతు ఉద్యమాలకు ఆకుపచ్చ కండువాలు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా అందించాలని మూడు దశాబ్దాల క్రితం రైతులు ఉద్యమించారు. ఆ ఉద్యమంలో పచ్చ కండువాలను ఉపయోగించి ఐకమత్యాన్ని చాటారు. అలాగే ఎర్రజొన్న, పసుపు పంటలకు గిట్టుబాటు ధర కోసం, వ్యవసాయ రుణాల మాఫీ తదితర ఉద్యమాల్లో రైతుల భుజాలపై పచ్చ కండువానే ప్రధానంగా కనిపించింది.



పార్టీ కండువాలు పక్కకు..

రైతు ఉద్యమాలకు సంఘీభావం తెలిపే రాజకీయ పార్టీల నాయకులు తమ పార్టీల కండువాలను పక్కన పెట్టి ఆకు పచ్చ కండువాలు వేసుకోవడం నాటి నుంచి వస్తోంది. జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకులు తాము రైతుల పక్షమే అని చెప్పే ప్రయత్నాలను పచ్చ కండువాల ద్వారా ముమ్మరం చేశారు. రైతుల భుజాలపైనే కనిపించిన పచ్చకండువా ఇప్పుడు చోటామోటా నాయకుల నుంచి ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి భుజాలపైకి చేరింది.



మోర్తాడ్‌లోని బద్దం నర్సారెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు (ఫైల్)



రాజకీయాలకు అతీతంగా పచ్చ కండువాలు కప్పుకొని బైఠాయించిన నాయకులు (ఫైల్)

సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా..

రైతులకు ప్రత్యేక గుర్తింపునిచ్చే పచ్చ కండువాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఉద్యమంలో భాగంగా నాయకులు సాంఘిక దురాచారాల నిర్మూలనపైనా దృష్టి సారించారు. రైతులు తమ పిల్లలను బాగా చదివించాలని చైతన్యం తీసుకువచ్చారు. బాల్య వివాహాల సాంఘిక దురాచారాన్ని రైతు ఉద్యమం ద్వారా అడ్డుకున్నారు. అలాగే రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇప్పించడం, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో లో వోల్టేజీ సమస్యను అధిగమించడం, 130 కేవీ సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించడంలోనూ పచ్చకండువాల ఉద్యమం కీలకపాత్ర పోషించింది. రెవెన్యూ, సహకార రుణాల బలవంతపు రికవరీలు నిలిచిపోయాయి!

రైతు ఉద్యమాలకు ఆద్యుడు



పార్టీలతో సంబంధం లేకుండా రైతు ఉద్యమాలు చేపట్టడంలో బద్దం నర్సారెడ్డి ఆద్యుడు. ఆయన అల్లుడిగా రైతులు, ప్రజా సమస్యలు, సాంఘిక దురాచారాలపై ఉద్యమించడాన్ని ఆదర్శంగా తీసుకున్నా. రైతు సమస్యపై ఎక్కడ ఉద్యమం జరిగినా ఆకు పచ్చ కండువాలు కనిపిస్తున్నాయి. – కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

రైతులను ఏకం చేసింది



రాజకీయ నాయకులు రైతులతో కలిసి నడవాలంటే తమ పార్టీల కండువాలను పక్కన పెట్టి ఆకు పచ్చ కండువాలు వేసుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులను ఆకుపచ్చ కండువా ఏకం చేసింది. అన్నదాతకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. – ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, బాల్కొండ

పసుపు బోర్డు ఉద్యమంలో..



పంటలకు గిట్టుబాటు ధర కోసమే కాకుండా పసుపు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించేలా చేపట్టిన ప్రతి ఉద్యమంలోనూ ఆకుపచ్చ కండువాలే కీలకంగా కనిపిస్తాయి. బోర్డు మంజూరు చేసింది మోదీ ప్రభుత్వమే అయినా.. ఉద్యమ స్ఫూర్తిని రగిల్చింది పచ్చ కండువాలే. – పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు చైర్మన్

గిట్టుబాటు ధర కోసం..



పార్టీలకు అతీతంగా పచ్చ కండువాలు వేసుకుని పసుపు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధర కోసం ఉద్యమాలు చేశాం. పసుపు బోర్డు, మద్దతు ధరకోసం చేపట్టిన ఉద్యమాల్లో ఆకుపచ్చ కండువా కీలకంగా మారింది. – అన్వేష్‌రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

దేశ వ్యాప్తంగా గుర్తింపు



ఆర్మూర్ ప్రాంతంలో ప్రారంభమైన పచ్చ కండువాల ఉద్యమం ఇక్కడికే పరిమితం కాకుండా దేశ వ్యాప్తంగా రైతులకు గుర్తింపు తెచ్చింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఎక్కడ ఉద్యమం జరిగినా రైతుల భుజాలపై పచ్చ కండువానే కనిపిస్తుంది. – కోటపాటి నర్సింహానాయుడు, ఉద్యమ నాయకుడు, ఆర్మూర్

రైతుల భావోద్వేగాల్లో..



పచ్చ కండువా కేవలం రైతు ఉద్యమాల్లో మాత్రమే కాకుండా రైతులను సమాజంలో ఆత్మ గౌరవంతో ఉన్నతంగా నిలబెట్టడంలో, వారి భావోద్వేగాల్లో సైతం భాగస్వామ్యమైంది. పచ్చ కండువాతో రైతుల ఐడెంటిటీగా మారిపోయింది. – వి.ప్రభాకర్, ఉద్యమ నాయకుడు, ఆర్మూర్

మార్కెట్‌యార్డులో ఉద్రిక్తత

- సెక్యూరిటీ సిబ్బందిపై దాడి..
- ఆందోళనతో మూడు గంటలపాటు నిలిచిన కొనుగోళ్లు



పోలీసు వాహనంపై దాడి చేస్తున్న కార్మికులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కార్మికుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మార్కెట్‌లో పసుపు దొంగతనాలకు తమల్ని బాధ్యులను చేస్తున్నారని ఆరోపిస్తూ చాటా, ముల్లే, హమాలీ, దడువాయి, మునీమ్‌లు శనివారం ఉదయం నుంచే గంజ్‌లోని క్షేత్రస్థాయి సిబ్బంది కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి మార్కెట్ కమిటీకి చేరుకుని యూనియన్ల ప్రతినిధులు, కొంత మంది కార్మికులతో చైర్మన్ తన కార్యాలయంలో సమావేశమై చర్చించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చైర్మన్ విజ్ఞప్తిచేయగా, ఆందోళన విరమించేందుకు వారు ఒప్పుకున్నారు.

భద్రతాసిబ్బందిపై దాడి

ఆందోళన చేస్తున్న కార్మికులతో మాట్లాడేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కార్యాలయం వద్దకు యూనియన్ ప్రతినిధులతో కలిసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి చేరుకున్నారు.

అప్పటికే అక్కడ ఆందోళన చేస్తున్న వారు మాట వినే పరిస్థితి లేకుండా పోయింది. కొందరు చైర్మన్ కారు వైపు దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో.. ఆయన వెనుదిరిగారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, శ్రావణ్‌పై కొంత మంది దాడికి తెగబడ్డారు. వారిని పోలీస్ వాహనంలో తీసుకెళ్తుండగా, వాహనాన్ని అడ్డుకుని అద్దాలు పగులగొట్టారు. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. దాడి విషయం తెలుసుకున్న సీఐ, మూడో టౌన్ ఎస్సై అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

పలువురిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: మార్కెట్ యార్డులో పోలీసుల వాహనం అద్దాలు ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై హరిబాబు తెలిపారు. మరికొందరిని గుర్తించామని వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. తమపై దాడి జరిగిందని సెక్యూరిటీ గార్డులు శ్రీనివాస్, శ్రావణ్ ఫిర్యాదు చేయగా, పలువురు హమాలీలపై కేసు నమోదు చేశామన్నారు.

యథావిధిగా కొనుగోళ్లు

మార్కెట్‌యార్డులో కార్మికుల ఆందోళనతో మూడు గంటలపాటు క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఆందోళన విరమించిన వెంటనే కొనుగోళ్లు యథావిధిగా చేపట్టారు. ఆందోళన కారణంగా ఆలస్యం కావడంతో ఈ–నామ్‌లో ధర కోట్ చేయడానికి కొనుగోలుదారులకు సమయంలో వెసులుబాటు కల్పించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత పసుపు క్రయవిక్రయాలు సాఫీగా జరిగినట్లు మార్కెటింగ్ అధికారులు పేర్కొన్నారు. 6 వేల క్వింటాళ్ల పసుపు క్రయవిక్రయాలు జరిగినట్లు తెలిపారు.

ఎండలో అరగంట..



నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వేగేటు వద్ద అరగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శనివారం మధ్యాహ్నం 3.15 నుంచి 3.45 గంటల వరకు గూడ్స్ రైలు ద్వారా ట్రాక్‌కు ఇరువైపులా కంకర పోశారు. దీంతో గేటుకు ఇరువైపులా వాహనదారులు అరగంటపాటు ఎండలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే పనుల నేపథ్యంలో ముందస్తు సమాచారం ఇస్తే తాము ప్రత్యామ్నాయదారుల్లో వెళ్లేవారమని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

ఎస్సారెస్పీ సగం ఖాళీ!

- 40 టీఎంసీలకు పడిపోయిన నీటి మట్టం
- వేగంగా తగ్గుదల
- కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



తగ్గిన ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: యాసంగి సీజన్ పంటల కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. శనివారం నాటికి సగం నీరు ఖాళీ అయ్యింది. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగి పంటల కోసం గతేడాది డిసెంబర్ 25 నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. సుమారు 50 రోజుల వ్యవధిలో 40.5 టీఎంసీల నీరు ఖాళీ అయ్యింది. వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు 10 టీఎంసీల నీటిని తరలించడంతో నీటి మట్టం వేగంగా తగ్గగా, మరో 70 రోజులపాటు నీటిని తరలించాల్సి ఉంది. ప్రస్తుత లెక్క ప్రకారం చూస్తే ఆయకట్టుకు చివరిలో నీటి తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిలో నుంచి 5 టీఎంసీలు డెడ్ స్టోరేజీ, 5 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 3 టీఎంసీలు ఆవిరి రూపంలో పోగా మిగిలేది 27 టీఎంసీలు మాత్రమే. ఇకనైనా ప్రాజెక్ట్ అధికారులు, ఆయకట్టు రైతులు సమన్వయంతో నీటి వినియోగం చేపడితే కొంత మేర నీటి తిప్పలు తప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే చేతికొచ్చే సమయంలో పంటలకు నీరందక ఎండిపోయే ప్రమాదం ఏర్పడుతుంది.

వరద కాలువకు 3వేలు.. కాకతీయకు 2,500 క్యూసెక్కులు..

ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2500 క్యూసెక్కులు, వరద కాలువకు 3 వేలు, లక్ష్మికాలువకు 250, సరస్వతి కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, గుత్ప లిఫ్టుకు 225, అలీసాగర్ లిఫ్టుకు 360, ముంపు గ్రామాల లిఫ్టులకు 312 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 309 క్యూసెక్కుల నీరు పోతుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

కేసీఆర్‌ను బహిష్కరించడం కలలో మాట

- ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన ఘనత రేవంత్‌ది
- ఆయనను ప్రజలు గుర్తించడం లేదు
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి బహిష్కరించడం కలలో మాట అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్‌లోని క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణా రాష్ట్రం సాధించకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా? అని ప్రశ్నించారు. జై తెలంగాణ అన్న వారిపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అని అన్నారు. కేసీఆర్ తెలంగాణా తీసుకురాకుంటే రేవంత్‌రెడ్డి ఆంధ్రాపాలకుల మోచేతినీళ్లు తాగుతూ బతికే వాడని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో 420 హామీలు అమలు చేస్తానని గద్దెనెక్కి 14 నెలలు దాటినా ఒక్క హామీ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రజలు గుర్తించడం లేదని, సొంత పార్టీ నాయకులే ఆయన పేరు మరచిపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పరిపాలన దేశమంతా తెలిసిపోయిందన్నారు. కులగణన అంతా బోగస్ అని, మీపై నమ్మకం లేకే ప్రజలు సర్వేలో పాల్గొనలేదన్నారు. సర్వేలో పాల్గొన్న వారు సరైన వివరాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. 15 ఏళ్లపాటు సుదీర్ఘపోరాటం చేసి, ఎన్నో పదవులు గడ్డిపోచలా వదిలేసి తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని అన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితవు పలికారు.

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత



నిజామాబాద్అర్బన్/నందిపేట్: చిన్ననాటి మిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి అతడి మిత్రులు అండగా నిలిచారు. నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన నరేష్ (35) నిజామాబాద్లోని ఎస్ఎస్వీ (మాణిక్భవన్) హైస్కూల్లో పదో తరగతి (2003–04)వరకు చదువుకున్నాడు. ఖలీల్వాడీలోని ఒక బ్లడ్ బ్యాంక్లో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నరేష్ చిన్ననాటి మిత్రులు (10వ తరగతి బ్యాచ్) అందరూ కలిసి అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. రూ.4లక్షలు జమచేసి శనివారం ఐలాపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి అందజేశారు. భవిష్యత్లో అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు మానిక్ భవన్ హైస్కూల్ వెల్ఫేర్ సొసైటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, ప్రాక్టికల్స్ జరిగినట్లు తెలిపారు. 63 మంది విద్యార్థులకు 61 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో జనరల్ ప్రాక్టికల్స్లో 4781 మందికి 4731 మంది హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్లో 3152 మందికి 3046 మంది హాజరైనట్లు తెలిపారు.ప్రిన్సిపాల్ నరేందర్, తదితరులున్నారు.

28 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ థీయరీ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్సైట్ను సందర్శించాలని కంట్రోలర్ కోరారు.

ఆరాంఘర్ టు ఆర్మూర్

- బయటపడ్డ బైక్ స్కాం
- ఆరాంఘర్లో సూత్రధారులు
- కామారెడ్డిలో మధ్యవర్తి.. సబ్ ఏజెంట్లతో దందా
- బైక్ పోయిందని ఇన్సూరెన్స్ క్లెయిమ్.. ఆ తర్వాత సగం రేటుకే విక్రయం
- ఆర్మూర్ పోలీసుల తనిఖీల్లో వ్యవహారం గుట్టురట్టు
- ఇప్పటి వరకు 34 బైక్లు స్వాధీనం



ఖలీల్వాడి: సాధారణ వ్యక్తుల్లా షోరూమ్కు వస్తారు.. ఫైనాన్స్లో కొత్త బైక్ను కొని.. రెండు, మూడు నెలలపాటు ఈఎంఐలు చెల్లిస్తారు. ఆ తర్వాత బైక్ పోయిందంటూ బీమా క్లెయిమ్ చేసుకుంటారు. తీరా అదే బైక్ను సగం రేటుకే ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ మోసాలకు పాల్పడుతోంది ఓ ముఠా. తీగ లాగితే డొంక కదిలినట్లు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో వ్యవహారం మొత్తం బయట పడింది.ఒకటి,రెండూ కాదు..ఇప్పటి వరకుఏకంగా 35 బైక్లను పోలీసులు ఈ స్కామ్లో గుర్తించారు.

బైక్ స్కామ్ జరిగింది ఇలా

హైదరాబాద్లోని ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యాపారులు బైక్ స్కామ్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురికి కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ బ్రోకర్తో పరిచయం ఏర్పడింది. ఆ బ్రోకర్ పలువురు సబ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారికి తెలిసిన వారి ఆధార్కార్డు, ఒక సిమ్ తీసుకుంటారు. ఆధార్లో చిరునామా, వివరాలను మార్ఫింగ్ చేస్తారు. ఆ తర్వాత ఆరాంఘర్ వ్యాపారులు బైక్కు కావాల్సిన డౌన్పేమెంట్ను బ్రోకర్కు పంపిస్తారు. ఆ బ్రోకర్ డబ్బులను సబ్ ఏజెంట్లతో పాటు ఇతరులకు అందజేస్తాడు. వాళ్లు బైక్ షో రూంకు వెళ్లి నచ్చిన వాహనాన్ని కొనుగోలు చేస్తారు. మొదటి, రెండు వాయిదాలను సక్రమంగా చెల్లించిన తర్వాత బైక్ను ఎత్తుకెళ్లారని సమీప పోలీస్స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేస్తారు. అలా బైక్కు ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులను తీసుకుంటారు. ఇదంతా చేసినందుకు బ్రోకర్, సబ్ ఏజెంట్లు, బైక్ తీసుకున్న వ్యక్తులు ఒక్కొక్కరికి రూ. 5వేల వరకు ఆరాంఘర్ వ్యాపారులు ఇస్తారు. మిగితా డబ్బులను ఆ బ్రోకర్ ఆరాంఘర్ వ్యాపారులకు పంపిస్తారు. కొనుగోలు చేసిన బైక్లను కొన్ని నెలలపాటు దాచి ఉంచి.. ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, యువకులకు ఒక్కో బైక్ను సుమారు రూ.50వేల నుంచి 70 వేల వరకు విక్రయిస్తారు. అనంతరం ఆ డబ్బులను సైతం తిరిగి ఆరాంఘర్ వ్యాపారులకు పంపిస్తారు.

బయటపడిందిలా..

ఆర్మూర్ ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా ఓ బైక్ పట్టుబడింది. సంబంధిత పత్రాలు సమర్పించాలని, లేదంటే పోలీస్స్టేషన్కు తరలిస్తామని వాహనదారుడికి పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో భయపడ్డ వాహనాదారుడు జరిగిన వ్యవహారాన్ని పోలీసులకు స్పష్టంగా వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఈ ఒక్క బైక్ తీగలాగితే..హైదరాబాద్లోని ఆరాంఘర్ లింక్ దొరికింది. పెద్ద మొత్తంలో బైక్స్కామ్ జరిగినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

మరిన్ని బైక్లు దొరికే అవకాశం..

ఆరాంఘర్ వ్యాపారులు చెప్పిన ప్రకారం బ్రోకర్తోపాటు సబ్ ఏజెంట్లు విక్రయించిన బైక్లన్నీ ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. పోలీసులు శనివారం వరకు 34 బైక్లను స్వాధీనం చేసుకున్నారు. మున్ముందు మరిన్ని బైక్లు దొరికే అవకాశాలున్నట్లు తెలిసింది. బ్రోకర్తోపాటు సబ్ ఏజెంట్లను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆరాంఘర్కు చెందిన ముగ్గురితో ఉన్న సంబంధాలు, వ్యాపారాలపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాగా, తక్కువ ధరకే బైక్ కొనుగోలు చేసిన వారు కంగుతిన్నారు. వాహనాలతోపాటు డబ్బులు నష్టపోయామంటూ లబోదిబోమంటున్నారు.

రైతు సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత

- మార్కెట్యార్డులో సిబ్బందిపై దాడి బాధాకరం
- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్నగర్: రైతు సంక్షేమానికే మార్కెటింగ్శాఖ, పాలకవర్గం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్యార్డులో సెక్యూరిటీ, కార్యాలయ సిబ్బందిపై దాడి బాధాకరమని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. నగరంలోని శ్రద్ధానంద్గంజ్లో శనివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీ సెక్యూరిటీ సిబ్బందిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడులు సరికావని తెలిపారు. మార్కెట్యార్డులో రైతుల శ్రేయస్సు కోసమే ప్రతిఒక్కరూ పని చేస్తున్నారన్నారు. పసుపు చోరీపై యూనియన్ల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు మొదటి తప్పుగా భావించి వదిలేశామని, పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. భవిష్యత్లో దొంగతనాలు, దాడి ఘటనలు పునరావృతం కాకుండా చాటా, ముల్లే, హమాలీ, దడువాయి, మునీమ్ యూనియన్లు హామీనిచ్చాయని చైర్మన్ తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. మార్కెట్యార్డులో సెక్యూరిటీ సిబ్బందిపై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. దాడులకు పాల్పడిన వారిపై యూనియన్ పరంగా చర్యలు ఉంటాయని, భవిష్యత్లో దాడులు జరగకుండా యూనియన్ బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. డీఎంవో గంగు, ఏఐటీయూసీ నాయకులు చక్రపాణి, డైరెక్టర్లు మారుతి, మల్లేష్, ముల్లంగి గంగారెడ్డి, చాటా, ముల్లే, హమాలీ, దడువాయి, మునీమ్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సమర్థవంతంగా పనిచేయాలి



శిక్షణ పూర్తిచేసుకున్న 'ఆపద మిత్ర' వలంటీర్లతో అధికారులు

నిజామాబాద్అర్బన్: అనుకోని రీతిలో విపత్తులు సంభవించిన సమయాల్లో 'ఆపద మిత్ర' వలంటీర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్కుమార్ అన్నారు. ఈమేరకు 'ఆపద మిత్ర' వలంటీర్లకు శిక్షణ అందిస్తుండగా, వంద మందితో కూడిన మొదటి బ్యాచ్కు శిక్షణ ముగిసింది. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. విపత్తులు సంభవించిన సందర్భాల్లో స్థానికంగా ఉండే సామాజిక కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలనే ఉద్దేశ్యంతో 'ఆపద మిత్ర' పేరిట శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు నేర్చుకున్న అంశాలను గుర్తించుకొని విపత్తులు వాటిల్లినప్పుడు సమర్థవంతంగా సేవలు అందించాలన్నారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు సాగునీటి కష్టాలు



ట్యాంకర్ ద్వారా వరి పొలానికి నీరందిస్తున్న అన్నదాత

సిరికొండ: వరి సాగుకు నీరందక అన్నదాత అరిగోస పడుతున్నాడు. మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావులు వట్టిపోతున్నాయి. దీంతో చివరి దశలో ఉన్న వరి పొలాలను కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. సిరికొండ శివారులో పారిపల్లి గంగాధర్ అనే రైతు బోరు ఎత్తేయడంతో తన పొలానికి ట్యాంకర్ ద్వారా శనివారం నీళ్లు పారించాడు. ఈదృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది. సిరికొండ మండలంలో సాగునీటి కోసం ప్రాజెక్టులు, కాలువలు లేకపోవడంతో పూర్తిగా బోరుబావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తుంటారు. ప్రతియేటా యాసంగి సీజన్లో భూగర్భ జలాలు అడుగంటి, బోర్లలో నీరు రాకపోవడంతో పంటలు చివరి దశకు వచ్చిన ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా మండలంలో సాగు నీటి కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

- 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్సీ కవిత డిమాండ్



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం మహిళపై దాడి చేసిన సీఐపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్రెడ్డిని 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం డిమాండ్ చేశారు. బాధిత మహిళ భాగ్యకు సత్వరం న్యాయం చేయాలని పేర్కొన్నారు. పోలీసు అధికారి మానవత్వం మరిచి మహిళపై లాఠీతో దాడి చేయడం అమానుషమన్నారు. రేవంత్రెడ్డి ప్రజాపాలన అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు.

కొబ్బరి బొండాల పేరిట బురిడీ

- తక్కువ ధరకే బొండాలను పంపిస్తామని సైబర్ నేరగాళ్ల మోసం
- రూ.1.68లక్షలకు టోకరా

ఖలీల్వాడి: కొబ్బరి బొండాలు తక్కువ ధరకు పంపిస్తామంటూ ఆన్లైన్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తికి రూ.1.68లక్షలకు టోకరా వేశారు. ఒకటో టౌన్ ఎస్హెచ్వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రూ.3లక్షల విలువచేసే కొబ్బరి బొండాలను రూ.1.68 లక్షలకు పంపిస్తామంటూ మొబైల్ ఫోన్లో ప్రకటన కనిపించడంతో కోజాకాలనీకి చెందిన షబానాజ్ ఆన్లైన్లో డబ్బులు చెల్లించాడు. కొబ్బరి బొండాలు రాకపోగా, ఆన్లైన్లో సంప్రదించినా సరైన స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించాడు. టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్వో రఘుపతి తెలిపారు.

అడవులను నరికితే శిక్ష తప్పదు



వర్ని: అడవులను నరికితే శిక్ష తప్పదని బోధన్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయి శివ స్పష్టం చేశారు. 'అటవీ చట్టాలు – శిక్షలు' అనే అంశంపై వర్ని మండలం జలాల్పూర్లో శని వారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. అడవుల్లో చెట్లను నరికి సంపద చేసుకోవడం, వ్యవసాయం చేయడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని రైతులు అభివృద్ధి సాధించాలని సూచించారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘన

- ఒకరికి రూ.15వేల జరిమానా

భిక్కనూరు: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేయడంతో ఆయన జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. మండలంలోని రామేశ్వర్పల్లి గ్రామానికి చెందిన పెరుక శ్రీనివాస్ గతంలో ఒక కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అట్టి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి అతడు ఒక ఆర్టీసీ బస్ డ్రైవర్పై అకారణంగా చేయిచేసుకున్నాడు. దీంతో శ్రీనివాస్పై కేసు నమోదు చేసుకుని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేయగా రూ.15వేల జరిమానా విధించారన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వీరి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున కోటగిరి పోలీస్స్టేషన్కు తరలించారు. పోతంగల్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లో, గుట్టల్లో, ఇటుక బట్టిల్లో అక్రమార్కులు ఇసుక డంప్లు ఏర్పాటు రాత్రి వేళ టిప్పర్లలో నింపి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై దృష్టిసారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పేకాడుతున్న 11మంది అరెస్టు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న 11మందిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 11మందిని పట్టుకోగా, వారి వద్దనుంచి రూ. 23,440 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

బోధన్ మండలంలో..

బోధన్ రూరల్: మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి శనివారం తెలిపారు. అలాగే వారివద్ద నుంచి రూ.16,390లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రైం కార్నర్

కూతురిని ఇంటికి తీసుకువస్తుండగా రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి బస్సు, లారీని ఢీకొన్న కారు
- తండ్రి మృతి, కుమార్తెకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చిన తండ్రి, హైదరాబాద్లోని హాస్టల్లో ఉంటున్న కూతురును ఇంటికి తీసుకువస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి హైవే 44పై ఈఘటన జరుగగా తండ్రి మృతిచెందాడు. కుమార్తెకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన ర్యాడ గంగాధర్(45), ఈనెల 14న దుబాయ్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు. అతడి కూతురు లహరి హైదరాబాద్లో హాస్టల్లో ఉంటూ చదువుకుంటుండగా, ఇంటికి తీసుకురావడానికి శుక్రవారం ఆయన కారులో వెళ్లారు. కూతురుతో కలిసి కారులో స్వగ్రామానికి వస్తుండగా శనివారం తెల్లవారుజామున అడ్లూర్ ఎల్లారెడ్డి బ్రిడ్జి వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి ముందున్న లారీని ఢీకొట్టడంతో గంగాధర్కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



నారాయణ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న జాలర్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్లోకి చేపలవేటకు వెళ్లిన ఓ జాలరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన బట్టుబుద్ది నారాయణ(50) శనివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్లోకి చేపలవేటకు వెళ్లాడు. వల వేసుకుంటూ నీటిలోపలికి వెళ్లి, తిరిగి బయటకు రాలేదు. స్థానిక మత్స్యకారులు గమనించి అతడు నీటిలో మునిగిపోయాడని గుర్తించారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టగా నీటిలో మృతదేహం లభ్యమైందన్నారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కరెంట్ షాక్తో ఒకరు..



మల్లయ్య (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి కరెంట్షాక్తో మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చిందం మల్లయ్య(48), మరో వ్యక్తితో కలిసి ఈనెల 14న రాత్రి పెళ్లి పందిరికి కావాల్సిన అల్లనేరడు చెట్టుకొమ్మలు తేవడానికి బ్రహ్మజివాడి గ్రామశివారులోకి వెళ్లారు. ఈక్రమంలో ఓ చెట్టుపైకి ఎక్కి అతడు కొమ్మలు కొట్టివేస్తుండగా అక్కడే ఉన్న కరెంట్ తీగలపై పడ్డాయి. కొమ్మలు పచ్చిగా ఉండటంతో విద్యుత్ సరఫరా జరిగి మల్లయ్య కరెంట్షాక్తో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కిష్టవ్వ, కుమారుడు మల్లేష్, ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కుక్క దాడిలో పలువురికి గాయాలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శుక్రవారం ఒక పిచ్చి కుక్క వేర్వేరుగా దాడి చేసిన ఘటనలో వృద్ధురాలితోపాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామంలో ఇంటి బయట పనుల్లో నిమగ్నమైన వారిపై కుక్క దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. కాగా క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- భర్త చంపాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని ఆందోళన



ధర్పల్లిలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



అనూష (ఫైల్)

ధర్పల్లి: మండలకేంద్రంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్పల్లికి చెందిన లోలం అనూష (26), వేల్పూర్ మండలం జాన్కంపేటకు చెందిన వినోద్ కొన్నేళ్ల క్రితం ప్రేమించుకుని, పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొద్దిరోజులుగా భార్యభర్తలు పిల్లలతో కలిసి ధర్పల్లిలోనే ఉంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం దంపతుల మధ్య గొడవలు జరుగగా వినోద్ ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. అనంతరం అనూష మృతిచెంది ఉండగా, కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనూషను భర్తే చంపాడని, వెంటనే అతడిని పోలీసులు పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ, మృతురాలి బంధువులు శనివారం రాత్రి మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. కాగా వినోద్ పరారీలో ఉన్నాడని, పోలీసులు అతని కోసం గాలిస్తున్నట్లు సమాచారం. తక్షణమే అనూష కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు



సీసీ ఫుటేజీలో దుండగుడి కదలికలు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న రెండంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో కిరాణ దుకాణం ఉండగా, రెండవ అంతస్తులో నీలా భాస్కర్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శుభకార్యం నిమిత్తం వారు శుక్రవారం ఇంటికి తాళం వేసి జిల్లాకేంద్రానికి వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన సుమారు 13 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులతోపాటు, రూ.3లక్షల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. బాధితుడు నీలా భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులు తీర్చలేక ఒకరి ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

రామారెడ్డి: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక తను నిర్మించిన ఇంట్లోనే ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ధరణీ నర్సింలు(44) ఇంటికి 3రోజులుగా ఒక వైపు తాళం ఇంకో వైపు గడియా పెట్టి ఉండడంతో స్థానికులు శనివారం పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూడగా అతడు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. నర్సింలు మూడేళ్ల క్రితం కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. ఇల్లు నిర్మాణానికి చేసిన అప్పులు తీరకపోవడంతో అతడు బాధపడుతుండేవాడు. ఈక్రమంలో భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లగా, ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్రావు తెలిపారు.

నిజాంసాగర్లో ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలో ఓ వ్యక్తి అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడ మండలం బుడ్మి గ్రామానికి చెందిన జీవన్(38), భార్య పిల్లలతో కలిసి నిజాంసాగర్ మండల కేంద్రానికి 8ఏళ్ల కిందట వలస వచ్చాడు. దంపతులు ఇద్దరు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2021లో అతడు పెద్ద కూతురు పెళ్లి కోసం రూ. 3లక్షలు అప్పు చేశారు. అప్పటి నుంచి అప్పులు పెరిగిపోవడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో అతడి భార్య కొన్నిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జీవన్ ఒక్కడే ఇంట్లో ఉంటుండగా, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



శంకర్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన నార్ల శంకర్ (40) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. శంకర్ కొన్నిరోజుల క్రితం హైదరాబాద్కు వలస వెళ్లగా, అతడి తల్లి మృతి చెందడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. హైదరాబాద్లో ఉన్న భార్యను ఈనెల 12న స్వగ్రామానికి రావాలని సూచించగా ఆమె రాలేదు. అప్పటినుంచి అతడు అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెంకటాపూర్లో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంపీవో ప్రకాశ్ శనివారం తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ఫ్యాక్టరీలో చెరుకుక్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 3లక్షల437టన్నుల క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ప్రెసిడెంట్ వేణుగోపాల్రావు అన్నారు.